www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 9 జనవరి 2023

## విశ్రాంత విసికి ఘన సన్మానం

విసిని సన్మానిస్తున్న కె.నరసింహారావు తదితరులు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

నన్నయ యూని వర్శిటీ విసి మొక్కా జగన్నాథరావు మూడేళ్ల తన పదవి ని పూర్తి చేసుకున్న సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు కెవిఆర్ఎన్.నంసింహారావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. నరసింహరావు మాట్లాడుతూ విసిగా జగన్నాథరావు యూనివర్శిటీ అభివృద్ధిలో భాగంగా ఐఎస్ఒ , నేక్ గుర్తింపు తీసుకురావడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో అబీబ్, ఎబి.నాయుడు, రమణారావు, జి.బ్రహ్మాజి, మంగేన ప్రసాద్, త్రినాథ్ స్వామి, కరాటం ప్రవీణ్,సుగుణ, కె. మనోహర్, కె.శ్రావణ్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# తగ్గేదేలే...

- బరుల ఏర్పాటులో నిర్వాహకులు,
- కోడిపందేలు నిలువరిస్తామంటున్న 'కోనసీమ' పోలీస్ బాస్
- జిల్లా సరిహద్దు ప్రాంతాల వైపు బరులు ఏర్పాటు చేస్తున్న వైనం

ముమ్మిడివరం నియోజకవర్గం తాళ్లరేవులో జాతీయ రహదారి చెంతనే సిద్ధమవుతున్న కోడిపందేల బరి

ప్రజాశక్తి-అమలాపురం

ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గేది లేదు అంటూ పోలీసులు.. మనల్ని ఎవరు ఆపుతారని కోడి పందేల నిర్వాహకులు.. అలా అనుకుంటూనే.. ఏటా కోడి పందేల జోరు షరా మామూలైంది. కానీ ఈ ఏడాది పోలీస్ బాస్ మాత్రం ఏ రాజకీయ ఒత్తిడినైనా సరే ధీటుగా ఎదుర్కొంటూ.. పందేలు నిలుపుదల చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. అయితే పందేల బరులు కూడా ఆయా రాజకీయ పార్టీల పరంగా ఏర్పాట్లు చేసి. తాము పంతం నెగ్గించుకుంటామని నిర్వహకులు సై అంటున్నారు.

సంక్రాంతి పండుగ అంటేనే జిల్లాలో కోడిపందేలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. సంక్రాంతి పండగకు సంప్రదాయాలు పేరుతో కోడిపందాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లాలో వారం రోజులు ముందు నుంచి కోడి పందేలు బరులతో పాటు గుండాటలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకునేవారు. పోలీసులు మాత్రం కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసు కుంటామని కోడి పందేల నిర్వాహకులు పై ఉక్కుపాదం మోపుతామని ప్రటనలకే పరిమితమయ్యేవారు.

ఈ సరదాగా నిర్వహించే కోడి పందేలు వెనకాల రూ.కోట్ల చేతులు మారేవి. పోలీసులు అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలోగ్గక తప్పేది కాదు. ప్రధానంగా జిల్లాలో ఐ.పోలవరం, అల్లవరం, అమలాపురం, కాట్రేనికోన, రాజోలు, కొత్తపేట, అయినవిల్లి, అంబాజీపేట, రావులపాలెం, ముమ్మిడివరం మండలాల్లో పెద్ద ఎత్తున కోడి పందేలు నిర్వహించేవారు. ప్రతి ఏటా సంక్రాంతికి వారం రోజులు ముందు నుంచే కోడి పందేల బరుల కోసం పందెం రాయళ్లు ఏర్పాట్లు చేసుకోవడం పోలీసులు రంగ ప్రవేశం చేసి బరులను ధ్వంసం చేసి వారిపై కేసులు నమోదు చేస్తున్నామని బైండోవర్ చేస్తున్నామని కోళ్లతో పాటు కోళ్లకు కట్టే కత్తులను స్వాధీనం చేసుకున్నామని చెబుతూ ఉంటారు. చివరికి సంక్రాంతి పండుగ మూడు రోజులు పందేలు యథేచ్ఛగా జరుగుతుంటే పోలీసులు మాత్రం కంటికి కనపడేవారు కాదు. ప్రతి ఏటా జరిగే తంతే ఇది.

### భిన్నంగా ఈ సారి పరిస్థితి

అయితే ఈసారి పరిస్థితి గతంలో కాకుండా కాస్త భిన్నంగా ఉంది. ఇప్పటివరకు జిల్లాలో ఎక్కడ కోడిపందేల బరులు ఏర్పాటుచేసిన దాఖలాలు చాలా తక్కువ అని చెప్పాలి. దీనికి ప్రధాన కారణం జిల్లా ఎస్పి సిహెచ్.సుధీర్ కుమార్ రెడ్డి వ్యవహార శైలే. ఆయన ఎదురుగా తప్పు జరిగితే సహించని ఆయన శైలి పందేల నిర్వాహకులకు ఇబ్బందిగా పరిణమించనుంది. జిల్లా ఎస్పిగా బాధ్యతలు చేపట్టిన తొలినాటి నుంచి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ముందు నుంచి హెచ్చరిస్తున్నారు. ఆయన వచ్చి రాగానే ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు సిబ్బందిపై బదిలీ వేటు వేశారు. రాజకీయ నేతల ఒత్తిళ్లకు కూడా తలోగ్గేది లేదని ఆయన సంకేతాలు ఇస్తున్నారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా పనిచేయడం, ఎక్కడా కూడా అవాంఛనీయ సంఘటన చోటుచేసుకున్నా చట్టం తన పని తానూ చేసుకుపోతుందని పదేపదే చెబుతున్నారు.

అయితే ఈసారి జిల్లా ఎస్పి హెచ్చరికలతో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో కోడిపందేల బరుల్లు ఏర్పాటు చేసేందుకు పందెం రాయుళ్లు సిద్ధమయ్యారు. ప్రధానంగా ముమ్మిడివరం నియోజకవర్గం తాళ్ళరేవు మండలంలో పెద్ద ఎత్తున కోడి పందేల కోసం సిద్ధం చేసిన బరులను పోలీసులు ఇప్పటికే ధ్వంసంచేశారు. అలాగే కాట్రేనికోన అల్లవరం తదితర తీర గ్రామ ప్రాంతాల్లో పోలీసులు ఇప్పటికే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి పందెం రాయుళ్ల ను హెచ్చరిస్తున్నారు.

జి ల్లాలో సినీ సెట్టింగ్ లను తలపించేలా కోడిపందేల బరులను ఏర్పాటు చేయడమే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి పందేలు తిలకించేందుకు రాజకీయ, సినీ ప్రముఖులు జిల్లాకు విచ్చేసేవారు. కోడిపందేల బరులు పక్కనే ఖాళీ స్థలాల్లో గుండాటలు, పేకాటలతో పాటు మద్యం, మాంసం దుకాణాలు ఏర్పాట్లకు వేలంపాటలు నిర్వహించి నిర్వహకులు రూ.లక్షల్లో దండుకునేవారు. పండగ వచ్చిందంటే పండుగ మూడు రోజులు ప్రతిరోజు పందేలు పేరిట రూ.వందల కోట్లు చేతులు మారేవి. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ వాసులు పందెంలో గెలిచిన కోడి కంటే కత్తి దెబ్బ తగిలిన కోస కు అధిక మొత్తం చెల్లించిఆ కోస కొనుగోలు చేస్తూ ఉంటారు.

### నిర్వహణ ప్రతిష్టాత్మకం

ఎవరు అవునన్నా.. కాదన్నా.. చాలా గ్రామాల్లో కోడి పందేలు నిర్వహణ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటారు. తమ పార్టీ అధికారంలో ఉండి కూడా పందేలు నిర్వహించికపోతే తమ పార్టీకే సిగ్గుచేటు అని కొందరు నాయకులు, ప్రతి పక్ష నాయకుల ఎదుట ప్రగల్బాలు పలుకుతున్నారు. అంతకీ అవసరం అయితే కేసులు వేరే పార్టీల వారిపై కట్టేలా వ్యవహరిస్తామని అధికార పార్టీవారు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. మరి ఈ సంక్రాంతి పండగకు కోడి పందేలు నిర్వహిస్తారా లేదా పోలీసులు ఉక్కుపాదం మోపుతారా చివరికి రాజకీయ నేతల ఒత్తిళ్ళతో మూడు రోజులు చూసి చూడనట్టు వదిలేస్తారా అనేది వేసి చూడాల్సిన అంశం.

భట్నవిల్లి శిలాఫలంక వద్ద రైల్వే లైనుకు నిధులు కేటాయించాలని నినాదాలు చేస్తున్న నాయకులు

## రైల్వేలైన్ కోసం మరో పోరాటానికి సిద్ధం

**డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ రైల్వే సాధన సమితి**

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వాసులు చిరకాలవాంఛ అయిన రైల్వే లైన్ సాధన కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని రైల్వే సాధన సమితి పిలుపునిచ్చింది. దశాబ్దాల నుంచి కోటి ఆశలతో ఎదురుచూస్తున్న కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ ఇప్పటివరకు పట్టాలెక్కలేదు. ఈ నేపథ్యంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో భట్నవిల్లి రైల్వే శిలాఫలకం వద్ద ఆదివారం సన్నాహక సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. రైల్వేలైన్ కోసం రాష్ట్ర ప్రభుత్వ నిధులు కేటాయింపులో విఫలమైందన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం వాటా 25 శాతాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి లోక్‌సభ స్పీకర్ జిఎంసి బాలయోగి కృషి ఫలితంగా రైల్వే లైన్ మంజూరైందన్నారు. ఆయన మరణానంతరం ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోయాయన్నారు. గత ప్రభుత్వాలన్నీ రైల్వే లైన్ కోసం నిధులను మంజూరు చేయడంలో విఫలమయ్యాయన్నారు. అనంతరం మాజీ ఎంపీ పండుల రవీంద్రబాబు కృషి ఫలితంగా రూ.650 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. వీటితో వశిష్ట, వైనతేయ, గౌతమి నదీపాయలపైన బ్రిడ్జి పనులు ప్రారంభించారని తెలిపారు. ఇందులో భాగంగా పిల్లర్ల నిర్మాణం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.250 కోట్లు కేటాయిస్తే మరో రూ.1000కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా కేటాయించకపోవడాన్ని సాకుగా చూపి కేంద్రం ఈ వేయికోట్లను విడుదల చేయట్లేదని తెలిపారు.

ఇప్పటికైనా పార్టీలను పక్కనపెట్టి అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా రైల్వేలైన్ కోసం కృషి చేయాలన్నారు. నిధులు కొరతను సాకుగా చూపి రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను మంజూరు చేయట్లేదని అన్నారు. ఈ కారణంగానే పనులను మధ్యలో నిలిపేశారని అన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న చమురు నిక్షేపాల ద్వారా కోట్లాది రూపాయలను తరలించకపోతున్న ఆయిల్ కంపెనీలు ఈ ప్రాంత అభివృద్ధికి అంతంత మాత్రంగా నిధులు కేటాయిస్తున్నాయన్నారు. దీనిపై ఎంఎల్ఎలు గాని, ఎంపీలు గాని పెదవి విప్పట్లేదన్నారు. కార్పొరేట్ ఆయిల్ కంపెనీలు నుంచి అధిక మొత్తంలో నిధులు రాబట్టడంలో, జిల్లాను అభివృద్ధి చేయడంలో వారు విఫలమయ్యారని అన్నారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ నిర్మాణానికి చమురు సంస్థల నుంచి ధులు కేటాయించేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలన్నారు. లేనిపక్షంలో చమురు సంస్థల కార్యకలాపాలను స్తంభింపజేస్తామని అన్నారు. ఈనెల 22న అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలతో కలిపి భట్నవిల్లి శిలా ఫలకం వద్ద విస్తత స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇందులో భాగంగానే ఈ సన్నాహక సమావేశం జరిగిందని అన్నారు.

ఈ సమావేశంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రైల్వే సాధన సమితి కన్వీనర్ బొంతు రమణ, నాయకులు రేవు తిరుపతిరావు, కారెం వెంకటేశ్వరరావు, బత్తుల సాయి పంబల నాగేంద్ర, ఊటాల వెంకటేష్, మోకా శ్రీను, నల్ల చంద్ర, శెట్టిబత్తుల తులసీరావు, గెద్దాడ బుద్ధరాజ్, మెండి డేవిడ్, సాపే రమేష్, పొలమూరి వెంకట్, మెరమెల్ల శివ, నేల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

## బాధిత కుటుంబానికి బీమా అందజేత

ప్రజాశక్తి - ఆలమూరు

చెముడులంకలో ఇటీవల అనారోగ్యంతో జల్లూరి జగ్గారావు మరణించారు. దీంతో వైఎస్ఆర్ బీమా ద్వారా రూ.లక్ష మంజూరయ్యాయి. సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ చేతుల మీదుగా మృతుని జగ్గారావు భార్య దుర్గకు ఆదివారం ఆ నగదును రూపంలో అందజేశారు. ప్రభుత్వం ముందు చూపుతో బాధిత కుటుంబాలను ఆదు కునేందుకు చర్యలలో భాగంగా ఈ సంక్షేమ పథకం ప్రవేశపెట్టి అందజేస్తున్నట్లు సర్పంచ్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు, దొండపాటి చంటి, అడబాల వీర్రాజు, నాగిరెడ్డి సత్యనారాయణ, మోటూరి సురేష్, దొండపాటి వెంకట్రామయ్య, దొండపాటి శ్రీను, సుంకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

అంబేద్కర్ విగ్రహావిష్కరణలో ఎమ్‌ఎల్ఎ సతీష్ తదితరులు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేదకర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ముమ్మిడివరం ఎమ్ఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ఆదివారం ముమ్మిడివరం అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల్లో అంబేద్కర్ విగ్రహ ఎమ్ఎల్ఎ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య ద్వారానే ప్రపంచ మేధావి గా గుర్తింపు పొంది, మహోన్నతమైన భారత రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్ మనందరికీ మార్గదర్శకులని అన్నారు. గురుకుల పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ద్వారా నాణ్యమైన విద్యను అందజేస్తుందన్నారు. ఇక్కడ చదువుతున్న విద్యార్థినులు ఉన్నత చదువులు చదివాలన్నారు. గురుకుల పాఠశాలలో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరించడం అంటే మీరంతా అంతటి ఉన్నతి చదువులు అభ్యసించాలని గుర్తు చేయడానికే అని ముమ్మిడివరం నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం వల్లే బాలికలకు విద్య, ఉద్యోగాలతో పాటు , రాజకీయ నాయకుల పదవులు అనుభవిస్తున్నామని ముమ్మిడివరం మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుడిపూడి శ్రీమన్నారాయణ అన్నారు. అనంతరం బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో అంబేద్కర్ శిలా విగ్రహాన్ని బహూకరించిన దాతలు కర్రివానిరేవు కాశి భాగ్యలక్ష్మి జగపతిరావులను ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గంగా భవాని, స్కూల్ ఛైర్మన్ వడ్డీ శ్యాం ప్రసాద్, అధ్యాపకులు ఎమ్ఎల్ఎ సతీష్ కుమార్‌కు మెమెంటో అందజేసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి పి.చిట్టి రాజు, కాట్రేనికోన జెడ్‌పిటిసి సభ్యుడు నేల కిషోర్, వైస్ ఛైర్మన్ బోస్ రాజు, స్కూల్ కమిటీ మాజీ ఛైర్మన్ వడ్డీ సత్యనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## వికలాంగులకు అండగా ప్రభుత్వం

**మంత్రి విశ్వరూప్**

కేక్‌ను ప్రిన్సిపల్‌కు అందజేస్తున్న మంత్రి విశ్వరూప్

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు అండగా ఉంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని లూయా అంధుల పాఠశాలలో నిర్వహించిన బ్రెయిలి జయంతి వేడుకులకు మంత్రి విశ్వరూప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధత్వం శాపం కాదని వారికి చదువుకోవడానికి వీలుగా ప్రత్యేక లిపిని తయారు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలి మహనీయుడని అన్నారు. నేడు అంధులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటే బ్రెయిలిఆయన రూపొందించిన లిపియే కారణమన్నారు. మహారాష్ట్రకు చెందిన ప్రంజాల్ పాటిల్ మొదటి ఐఎస్ అధికారిణి అయ్యారని, ఇటీవల మన ప్రాంతానికి చెందిన కట్టా సింహాచలం ఐఎఎస్ అధికారి విధులు నిర్వర్తిస్తున్నారని అన్నారు. సిఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకు వస్తున్నారన్నారు. ఈ పాఠశాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని, దానిలో భాగంగానే ప్రస్తుతం ఉన్న ఈ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ప్రత్యామ్నాయ సదుపాయాలు ఏర్పాటు చేసి, 100మంది విద్యార్థులకు సరిపడా నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వచ్చే లూయిస్ బ్రెయిలి జయంతికి అన్ని మౌలిక సదుపాయాలతో నూతన పాఠశాల నిర్మించి అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. అదేవిధంగా తన దృష్టికి తీసుకు వచ్చిన విభిన్న ప్రతిభావంతులైన ఉద్యోగుల భార్యాభర్తలకు సంబంధించిన పింఛను సమస్యను సిఎం దష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, రాష్ట్ర దృశ్య కళల అకాడమీ ఛైర్మన్ కుడుపూడి సత్యశైలజ, అమలాపురం తహశీల్దార్ పల్లవి, వైస్ ఛైర్మన్ రుద్రరాజు వెంకటరాజు, తిక్కిరెడ్డి వెంకటేష్, రాష్ట్ర వైసిపి నాయకులు ఒంటెద్దు వెంకన్న నాయుడు, సూర్య పౌండేషన్ అధినేత వర్మ, లూయా అంధుల పాఠశాల ప్రిన్సిపల్ రామాయణం శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్లు నాగేంద్ర, నాని, రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముహూర్తం రాట వేస్తున్న దృశ్యం

## గనిపోతురాజు ఉత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-మండపేట

కేశవరంలోని గనిపోతురాజు స్వామి తీర్థ మహోత్సల ఏర్పాట్లు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జాతర మహోతవానికి వైసిపి రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు రాట ముహూర్తం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల16 సోమవారం నుంచి 31 మంగళవారం వరకు తీర్థ మహోత్సవాలు జరుగుతాయని 16న కనుమ నాడు జాతర, 17 న తీర్థం, ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ ఇఒ అన్నం దేవుల శ్రీనివాస్ అన్నారు. రాట ముహూర్తం కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పురంశెట్టి శ్రీనివాస్, కుర్ర తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రియదర్శిని'లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-కొత్తపేట

స్థానిక ప్రియదర్శిని పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించారు. సంక్రాంతి పురస్కరించుకుని వేడుకలు నిర్వహించుకున్నారు. విద్యార్థులు భోగిమంట వేసి నర్సరీ పిల్లలకు భోగి పళ్ళు పోశారు. ఆడపిల్లలంతా గొబ్బిళ్ళు పెట్టారు. సంక్రాంతి పాటలకు నత్యాలు చేశారు. పాఠశాల ఆవరణలో వివిధ రంగవల్లులు తీర్చిదిద్దారు. పిల్లలు సూర్యనారాయణమూర్తి చిత్రపటంతో ఒక ప్రభను నిర్మించి దానిని పాఠశాల పరిసర వీధులలో కేరింతలు కొడుతూ ఊరేగించారు. టీచర్లు, బాల బాలికలు సంప్రదాయ దుస్తులు, అలంకరణలతో ఈ వేడుకలలో పాల్గొన్నారు. ఎంతో ఆహ్లాదకరంగా కన్నుల పండవుగా ప్రియదర్శినిలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ వేడుకలలో పిల్లలు, ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు.

భోగి మండల వద్ద విద్యార్థుల సందడి

విద్యార్థులు ఏర్పాటుచేసిన ప్రభ

## కల్వర్టు నిర్మాణం చేపట్టాలి

**రైతుల ఆందోళన**

పనుల వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ప్రజాశక్తి -మండపేట

మండలంలోని ఏడిద నుండి ఏడిద సీతానగరం రహదారిలోని కంసాలి డ్రైన్ పై ఉన్న కల్వర్టరు శిథిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో పలువురు వాహనదారులు ప్రమా దాలు గురవుతున్నారని ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన వార్తకు స్పందించిన రోడ్డు భవనాల శాఖ అధికారులు తూరలు వేసేందుకు సన్నద్ధమ య్యారు. అయితే రైతులు తూరలు వద్దని కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. తూరలతో చెత్తాచెదారం అడ్డుపడి మురుగునీరు వెళ్లకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు అంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న జెడ్‌పిటిసి సభ్యుడు కురుపూడి భవాని, వైస్ ఎంపిపి పసుమర్తి నాగేశ్వరరావు, సీతానగరం గ్రామ సర్పంచ్ వరదా చక్రవర్తి అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడి అనంతరం విషయాన్ని ఎమ్ఎల్‌సి తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకువెళ్లారు.

అంగర్ మెయిన్‌రోడ్డు సమీపంలోట్రాన్స్‌ఫార్మర్

## ప్రమాదకరంగా ట్రాన్స్ ఫార్మర్

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అంగర మెయిన్ రహదారి సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ ఎలాంటి రక్షణ చర్యలు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, గ్రామస్తులు ప్రయాణికులు భయాందోళనలు చెందుతున్నారు. ప్రతినిత్యం రద్దీగా ఉండే రహదారిలో వాహనదారులు ప్రయాణికులు ఈ మార్గం ద్వారానే వెళ్లవలసి ఉందని పలువురు చెబుతున్నారు. వర్షం కురిసే సమయంలో ట్రాన్స్ ఫార్మర్ వద్ద ప్రమాద భరితంగా ఉందని సంబంధిత ట్రాన్స్ కో అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్ ఫార్మర్ కు రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు .

## కార్టూ'నిజం'

## దమ్ము ట్రాక్టర్లు రోడ్లపై తిరిగితే చర్యలు

దమ్ము ట్రాక్టర్, డ్రైవర్‌తో మాట్లాడుతున్న మంత్రి వేణు

ప్రజాశక్తి-రామచంద్రపురం

దమ్ము చేసే ట్రాక్టర్లు మెయిన్ రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకష్ణ ఆదేశించారు. ఆయన ఆదివారం ఉండూరు వంతెన దగ్గర రోడ్లపై దమ్ము ట్రాక్టర్లు తిరగడం గమనించారు. సంబంధిత ట్రాక్టర్ డ్రైవర్ను ప్రశ్నించి దమ్ము ట్రాక్టర్లు రోడ్లపై నడవడం నేరమని తెలిపారు. ఇలాంటి చర్యలు పునరాత్వం కాకుండా స్థానిక యంత్రాంగం పనిచేసే విధంగా సంబంధిత అధికారులతో మంత్రి మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆదేశాలు ఇచ్చారు.

## 300 మందికి వైద్య పరీక్షలు

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న అశోక్ వర్మ

ప్రజాశక్తి -మామిడికుదురు

గోగన్నమఠంలో భూపతి రాజు భరత్ వర్మ జ్ఞాపకార్థం ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కిడ్నీ స్పెషలిస్ట్ భూపతిరాజు అశోక్‌వర్మ, వైద్యులు పి.కిరణ్మయి, ఎం.రమేష్, సాగిరాజు గజపతి రాజు, చొల్లంగి అనిల్ వైద్య సేవలు అందించారు. గుండె, కిడ్నీ, నరాలు తదితర సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. రూ.60వేల విలువ చేసే మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో జడ్‌పిటిసి మాజీ సభ్యులు ఈశ్వరరాజువర్మ, పిఎసిఎస్ చైర్మన్ నరసింహవర్మ, అల్లు సురేష్, భూపతిరాజు సత్తిబాబురాజు తదితరులు పాల్గొన్నారు.

## 10 నుంచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - తాళ్ళరేవు

సంక్రాంతి సందర్భంగా పి.మల్లవరంలో ఈనెల 10, 11 తేదీల్లో రాష్ట్రస్థాయి మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుపూడి శివనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మల్ల వరం పెదపేట క్రీడా ప్రాంగణంలో ఏర్పాట్లను ఎంపీపీ చిన్నం సునీతతో కలిసి నిర్వాహకులు పరిశీలించారు. అనంతరం కుడుపూడి శివనారాయణ మాట్లాడారు. ఈనెల 10వ తేదీన కాకినాడ జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు పోటీలను ప్రారంభిస్తారన్నారు. మంత్రులు, వివిధ ప్రజాప్రతినిధులు అధికారులు, ఉన్నతాధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాయుడు సునీల్, ప్రకాష్ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, మట్టపర్తి పేదలు, యర్ర కుటుంబరావు, సోమా, ఫిరంగి సతీష్, శివ, శీలం బాలకృష్ణ, చంటి, దడల ఈశ్వర రావు, శ్రీను నల్లి శ్రీను రామకృష్ణ, కామాడి భైరవ మూర్తి, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్స్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లిలో ఆదివారం వాసవి క్లబ్ గండేపల్లి, వికేఎస్పీ క్లబ్ గండేపల్లి, మల్లేపల్లి వాసవి క్లబ్ 2023వ సంవత్సరంకు సంబంధించి ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వాసవి క్లబ్ గండేపల్లికి నూతన

ప్రమాణ స్వీకారం చేసిన వాసవి నూతన కార్యవర్గం

అధ్యక్షులు డిగా వాసవియస్ సత్యవరపు దుర్గా ప్రసాద్, కార్యదర్శిగా మాతంశెట్టి రాము, కోశాధికారిగా కటకం అంజిబాబు, వికెఎస్పీ క్లబ్ కి నూతన అధ్యక్షుడిగా వాసవియస్ కొంకిపుడి సిహెచ్ కొత్త లక్ష్మీ నారాయణ వీర గుప్తా, కార్యదర్శిగా వాకరపు వేణు గోపాలరావు, కోశాధికారిగా కటకం రామకృష్ణ, మల్లేపల్లి వాసవి క్లబ్ ప్రెసిడెంట్గా వాసవి శ్రీనివాస్ అండ్ టీమ్, జోన్ చైర్మన్ గా మాతంశెట్టి వీర వెంకట సురేష్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ గా వాకరపు నాగేశ్వరరావు, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ గా మండపల్లి సుబ్బారావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ వీ210ఏ డిస్ట్రిక్ట్ గవర్నర్, టీం రీజనల్ చైర్మన్, చీఫ్ గెస్ట్ కుసుమంచి పాలావర్తి ఆర్యవైశ్య సంఘం ప్రముఖుల సభ్యులు పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా భోగి మంటలు వేసి, చిన్నారులకు భోగి పళ్ళ పోసి, పిల్లలకు పతంగాల పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. క్లబ్ సేవా కార్యక్రమంలో భాగంగా ఆర్యవైశ్య మెరిట్ విద్యార్థులు ఇద్దరికి రూ. 7500 విద్యా ఖర్చుల నిమిత్తం అందజేశారు.

## నేటి నుంచి శ్రీ ప్రకాష్లో జాతీయ స్థాయి టిటి పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

రామారావు పేటలోని శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో ఈ నెల 9 నుండి 13వ తేదీ వరకు ఐదు రోజులపాటు జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు జరుగుతాయని స్కూల్ డైరెక్టర్ సిహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో 24 క్యాస్టర్లలో జరిగిన పోటీలలో విజయం సాధించిన సుమారు 1200 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పోటీల ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అకాడమీ ప్రెసిడెంట్ వి.భాస్కర్ రావు, ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాలశాఖ మంత్రి, శ్రీ ప్రకాష్ విద్యా నికేతన పూర్వ విద్యార్థి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ప్రముఖ పేలాంట్రోపిస్టు, స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ ప్రెసిడెంట్ సిబిఆర్ ప్రసాద్ లు పాల్గొంటారన్నారు. ఈపోటీలకు సంబంధించి చీఫ్ రేఫరీ పివిఎస్ సూర్యారావు, అసిస్టెంట్ చీఫ్ రిఫరీ పి.వేణుగోపాల రావు, డిఎస్ కుమార్, సికె భగవాన్ల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

## దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని శంగవరంలో కాకినాడ జిల్లా యాదవ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు మసుమేను గంగయ్య యాదవ్ సమకూర్చిన దుస్తులను ఆదివారం యాదవ్ సామాజిక వర్గానికి చెందిన వారికి చీరలు. దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో బద్ది రామారావు. లోండ దేవుళ్ళు అల్లు నూకరాజు పాల్గొన్నారు.

# జిల్లాలో ముమ్మరంగా వరినాట్లు

## ప్రజాశక్తితో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మాధవరావు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలోని రైతులు రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు. కోరుకొండ, గోకవరం మండలాలు మినహా మిగిలిన అన్ని మండలాల్లో దాదాపుగా సాగు ప్రారంభమైంది. రైతులు ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు. ఈ దశలో నీటి వనరులు, ఎరువుల లభ్యత తదితర విషయాలపై రైతుల్లో కలవరం మొదలైంది. మరో వైపు యూరియా కొరత నెలకొందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని సాగు సంబంధిత విషయాలు, ఎరువుల లభ్యతపై ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన వెల్లడించిన వివరాల్లో మాటల్లోనే..

**జిల్లాలో నాట్లు ఎన్ని ఎకరాల్లో ప్రారంభం అయ్యాయి. రబీ సాగు విస్తీర్ణం ఎంత?**

జిల్లాలో రబీ సాగు 2.07 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుందని అంచనా వేస్తున్నాం. దాదాపుగా అన్ని మండలాల్లో సాగు ప్రారంభమైంది. 60వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. గోకవర, కోరుకొండ మండలాల్లో ఖరీఫ్ కోతలు ఆలస్యంగా కావడంతో అక్కడ సాగు కొంత ఆలస్యంగా ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ నెల 15 నాటికి 90 శాతం నాట్లు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. సాగు ప్రారంభం నేపథ్యంలో రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉంచాం.

**జిల్లాలో యూరియా, ఎరువుల కొరత వార్తలపై ఏమంటారు?**

యూరియా కొరత లేదు. రబీ సాగుకు సంబంధించి రెండు నెలల ముందుగానే కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేశాం. రైతులకు కావల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాము. మొత్తం రబీ సాగుకు దశల వారీగా సుమారు 80 వేల మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం ఉంటుంది. తొలిదశ అవసరాలకు తగ్గట్లుగా 19,140మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులో ఉంo,. యూరియా 8,300 మెట్రిక్ టన్నులు, డిఎపి 4,200, కాంప్లెక్స్ ఎరువులు 6300, ఎంఒపి 2,500 మెట్రిక్ టన్నులు ఉన్నాయి.

**ముందస్తు సాగుతో రైతులకు ఎం ప్రయోజనం లభించింది..?**

రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతేడాది ఖరీఫ్లో ముందస్తు వ్యవసాయ ప్రణాళికలను రూపొందించడంతో మంచిఫలితాలు వచ్చాయి. గోదావరి వరదలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయే పరిస్థితుల నుంచి కొంత ఊరట లభించింది. తాజాగా రబీ కూడా నెల రోజులు ముందుగానే ప్రారంభమైంది.

**మెట్టలో సాగును ప్రోత్సహించేందుకు ఏం చర్యలు తీసుకున్నారు?**

జిల్లాలో 15,265 వ్యవసాయ బోర్లు ఉన్నాయి. వాటిలో 8,455 బోర్ల ద్వారా ఉద్యాన పంటలకు సాగు నీరు అందిస్తుండగా మిగిలిన 6,810 బోర్లు మెట్ట ప్రాంతంలోనే ఉన్నాయి. రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, రంగంపేట, బిక్కవోలు తదితర మండలాల్లో నాట్లు పూర్తయ్యాయి. మెట్ట ప్రాంతంలో 1.40 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుందని అంచనా వేస్తున్నాం. వీటిలో గొట్టపు బావుల సాయంతో 50 వేల ఎకరాల్లో సాగు చేస్తారు. రబీలో ఎక్కువగా ఆర్ఎన్ఆర్ 15048 వరి వంగడాన్ని సాగు చేస్తున్నారు. దీనికి తెగుళ్ల బెడదతక్కువ మంచి దిగుబడిని ఇస్తుంది. ఈ పంట తర్వాత మూడో పంటగా అపరాలు, జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట సాగు చేయటానికి ఈ ముందస్తు సాగు ఉపయోగ పడుతుంది.

**ప్రతి ఏటా రబీ చివరి దశలో నీటి కొరత తలెత్తుతోంది. దీన్ని అధిగమించేందుకు ఏం చర్యలు తీసుకున్నారు..?**

కలెక్టరు ఆధ్వర్యాన వ్యవసాయ శాఖతో పాటు ఇతర సాగు సంబంధిత శాఖలతో సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించి నీటి పంపిణీపై చర్చించారు. ఈ ఏడాది సాగునీటికి ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 71వేల గోదావరి ఆయకట్టుకు సాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించారు. ప్రతి సెంటుకూ నీరు అందించే లక్ష్యంతో క్రాస్‌బండ్‌లు, ఆయిల్ ఇంజిన్ల వంటి ప్రత్యామ్నాయ మార్గాలపైనా దృష్టి పెడుతున్నారు. కావున సాగునీటి కొరత ఇబ్బందులుండవు.

# 3వ రోజుకు గొల్లపల్లి నిరవధిక దీక్ష

యానాంలో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న సిఎం రంగసామి

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రజల సమస్యలు పరిష్కరరించాలని పలు డిమాండ్ల సాధనకు గాను యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చేపట్టిన నిరవధిక దీక్ష మూడవ రోజు ఆదివారం కూడా కొనసాగింది. గొల్లపల్లికి మద్దతుగా అధిక సంఖ్యలో మహిళలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు దీక్షలో పాల్గొన్నారు. రోజురోజుకు మద్దతు పెరుగుతూ అధికసంఖ్యలో నాయకులు, అభిమానులు, కార్యకర్తలు దీక్షా శిబిరానికి తరలివచ్చి గొల్లపల్లికి సంఘీభావం తెలిపారు. జిల్లాకు చెందిన ఆయా పార్టీల నాయకులు, ప్రముఖులు తదితరులు దీక్షా శిబిరంలో ఎమ్మెల్యే గొల్లపల్లిని కలిసి తమ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గొల్లపల్లి మాట్లాడుతూ ప్రభుత్వం తాను పేర్కొన్న సమస్యలను పరిష్కరించేవరకూ దీక్ష విరమించేది లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి యానాం సమస్యలు పరిష్కరిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రంగస్వామి అంటే తనకు గౌరవం ఉందని, తన మాటలు వక్రీకరించారని ఆయన ఆందోళన చెందారు. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి రంగస్వామి పుదుచ్చేరి నుంచి ప్రజా ఉత్సవాల ముగింపు సభలో పాల్గొనేందుకు సాయంత్రం యానాం విచ్చేశారు. అయితే గొల్లపల్లి దీక్షా శిబిరం వద్దకు ముఖ్యమంత్రి వెళతారా లేదా అన్న ఉత్కంఠ అందరిలోని నెలకొంది. ఈ విషయం యానాంలో చర్చనీయాంశమైంది.

దీక్షలో పాల్గొన్న ఎంఎల్ఎ అశోక్

## యానాం ఉత్సవాలకు సిఎం రంగసామి

ప్రజాశక్తి - యానాం

కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి ఆదివారం సాయంత్రం యానాం విచ్చేశారు. ఈ నెల 6వ తేదీన ప్రారం భమైన యానాం ప్రజా ఉత్సవాల ముగింపు సభలో పాల్గొనేందుకు యానాం విచ్చేశారు. ఆయనకు పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు స్వాగతం పలికారు. యానాం పోలీసుల సిఎం రంగసామికి గౌరవ వందనం సమర్పించారు.

## నేటి స్పందన కలెక్టరేట్‌లోనే ..

ప్రజాశక్తి కాకినాడ

2023 జనవరి 9 తేదీ సోమవారం నాటి స్పందన ప్రజా విజ్ఞాపన స్వీకరణ కార్యక్రమం ఉదయం 9:30 నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం, కాకినాడ లోనే జరుగుతుందని కలెక్టర్ కృతికా శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంశాన్ని అర్జీదారులు, జిల్లా అధికారులు గమనించాలని ఆమె కోరారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున మంత్రి వేణుగోపాలకృష్ణ

## 2024 ఎన్నికలో సిఎం అభ్యర్థిగా పవన్‌ను ప్రకటించగలరా

### - మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ముసుగు తొలగించి ప్రజలను మోసం చేయడానికి సిద్ధమైన, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కలిసి వచ్చే ఎన్నికల్లో సీఎం అభ్యర్థిగా పవన్ కళ్యాణ్ ప్రకటించగలరా అని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ ప్రశ్నించారు. కాకినాడ ఆర్అండ్‌బి అతిథి గృహాలను నిర్వహించిన విలేకరుల సమావేశం మాట్లాడారు. ప్రజా స్వామ్యంలో రాజకీయ పార్టీలు వారి లక్షల అనుసరించి ప్రజల్లోకి వెళ్లడం ఆనవాయితీని, కానీ చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాన్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనిని అడ్డుకువడమే లక్ష్యంగా ముందుకుసాగు తున్నారనారు. 2014లో ముఖ్యమంత్రిగా చేసిన తప్పులను పవన్ కళ్యాణ్ ఎందుకు ఎత్తి చూపడం లేదని ప్రశ్నించారు. ప్రశ్నించడానికి పార్టీ పెట్టి, విలువలతో కూడిన రాజకీయం చేస్తానన్న నీవు, 2019 ఎందుకు విడిపోయారో చెప్పాలని మళ్ళీ ఇప్పుడు ఎందుకు కలుస్తున్నారో చెప్పాలన్నారు. అసలు జనసేనకు ఎజెండా అంటూ ఏమైనా ఉందని, 175 స్థానాల్లో పోటీ పెట్టడానికి నాయకులు లేని జనసేన పార్టీ, కేవలం ప్యాకేజీ కోసమే చంద్రబాబుని కలిశారాన్నారు. ప్రజల పక్షానా జగన్మోహన్ రెడ్డి ఉన్నారని, కందుకూరు సభలో 8 మంది చనిపోతే తరువాతి సభలో జాగ్రత్తలు పాటించడం తెలియదాని ప్రశించారు. పవన్, చంద్రబాబు ముసుగు తొలగించి ముందుకు వచ్చారన్నారు. వైసీపీ ఎప్పుడు ఒంటరి పోరాటం చేస్తుందన్నారు. మాకు భయం లేదని, మాకు జన బలం ఉందన్నారు. 2011-14 లో మీ ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేయలేదని, ఏమి చేశారు చెప్పాలని చర్చిచడానికి సిద్ధంగా ఉన్నాన్నని, దమ్ముంటే చంద్రబాబు చర్చకు రావాలని డిమాండ్ చేశారు. కుప్పంలో రిగ్గింగ్ చేసి గెలిచిన నువ్వు , నీకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎజెండా లేని వ్యక్తులను తన పక్కకు తీసుకువచ్చి పని చేసుకోవాలని చూస్తున్న చంద్రబాబు 2024 ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ను సీఎం అభ్యర్థిగా ప్రకటించగలరా అని ప్రశ్నించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి -రైతులపూడి

రౌతులపూడి- బలరామపురం రహదారి మధ్యలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ పైడిపాల గ్రామానికి చెందిన కొరుప్రోలు వీరబాబు ఎస్.పైడిపాల నుంచి ద్విచక్ర వాహనంపై ములగ పూడి వెళ్తుండగా బలరాంపురం సమీపంలో రహదారిపై ప్రయాణిస్తున్న జిగిరెడ్డి నూకరావును ఢీకొట్టి రహదారిపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారమివ్వడంతో వీరబాబును తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మృతురాలి కుటుంబానికి చెక్కును అందజేస్తున్న మంత్రి వేణు

## హత్యకు గురైన విద్యార్థినికి రూ .10 లక్షల సాయం

ప్రజాశక్తి-రామచంద్రపురం

డిగ్రీ చదువుతూ హత్యకు గురైన కె.గంగవరం మండలం గంగవరం గ్రామానికి చెందిన కాదా శ్రీదేవి కుటుంబానికి సిఎం సహాయ నిధి నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర బిసి సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకష్ణ రామచంద్రపురంలో మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల చెక్కును అందజేశారు. మృతురాలి తల్లి కాదా నాగమణి, రాంబాబు దంపతులకు ఈచెక్కును అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పంపన సుబ్బారావు కోటి వెంకటరావు తదితరులు హాజరయ్యారు.

## ముగిసిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి -అమలాపురం

అమలాపురం కిమ్స్ కళాశాల గ్రౌండ్లో అనురాధ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్ విన్నర్స్ కి బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, జెడ్పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావులు హాజరయ్యారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఈ సందర్భంగా ముఖ్య అతిథులతో కలిసి విజేతలను అభినందించి నగదు బహుమతులను ట్రోఫీలను ఎంపీ చింతా అనురాధ విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో దశ్య కలల అకాడమీ ఛైర్మన్ శ్రీమతి కుడుపూడి సత్యశైలజ , హితకారిణి సమాజం ఛైర్మన్ కాశీ బాలముని కుమారి, జెడ్పిటిసి సభ్యులు కొనుకు గౌతమి, గెడ్డం సంపత్ రావు , పందిరి హరి, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్ లు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఒఎన్జిసి అధికారులు, నాయకులు, కార్యకర్తలు, టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి -రావులపాలెం

రావులపాలెం చిర్ల సోమసుందర రెడ్డి నగర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగాను, పాక్షికంగాను ఇళ్లు కాలిపోయి నిరాశ్రయులైన మానుపాటి సతీష్, బందరి శ్రీను తదితర కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్ఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి ఆదివారం పరామర్శించారు. వారికి రూ.21 వేలు నగదు సహాయంతో పాటు బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ బాధితులకు ప్రభుత్వం నుంచి అందవలసిన అన్ని సహాయ సహకారాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి కర్రి లక్ష్మీ వెంకట నాగదేవి, జెడ్పిటిసి సభ్యులు కుడుపూడి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాయం అందజేస్తున్న ఎమ్ఎల్ఎ జగ్గిరెడ్డి

## వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలో మార్కొండపాడుకు చెందిన షేక్ కరీముల్లా(35) అదృశ్యమైనట్టు కేసు నమోదు చేశామని ఎస్ఐ సిహెచ్‌వి.రమేష్ తెలిపారు. తన తండ్రి షేక్ కరీముల్లా రెండు నెలల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయిన ఇంత వరూ తిరిగి రాలేదని షేక్ సబీనాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. దర్యాప్తు చేపట్టామన్నారు.

## 'విలస'లో ఇదేం కర్మ మన రాష్ట్రానికి

ప్రజాశక్తి-అయినవిల్లి

విలసలో టిడిపి ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రాని కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా రచ్చబండ కార్యక్రమం విలస గ్రామశాఖ అధ్యక్షులు అక్కిశెట్టి దుర్గారావు ఆధ్వర్యంలో ంండల టిడిపి అధ్యక్షులు చిట్టూరి శ్రీనివాసు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జ్ గంటి హరీష్ మాధూర్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్‌పి మాజీ ఛైర్మెన్, రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి, నియోజకవర్గ కో కన్వీనర్, నామన రాంబాబు తదితుర్లు పాల్గొన్నారు.

### పాలనలో వైసిపి ప్రభుత్వం విఫలం

**ఉప్పలగుప్తం** రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్ఎల్ఎ, కాకినాడ నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు) అన్నారు. ఎన్.కొత్తపల్లి పంచాయతీ రాఘవులపేటలో ఆదివారం అమలాపురం మాజీ ఎంఎల్ఎ, నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జ్ అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొండబాబు, రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి నాగిడి నాగేశ్వరావులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

# హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి -మండపేట

మండపేట పట్టణలోని బైపాస్ రోడ్డులో స్ప్రింగ్ బోర్డ్ స్కూల్ సమీపంలో ఉన్న లేఔట్ లో గత ఏడాది డిసెంబర్ 31న తారీకున జరిగిన కుంజాల సురేష్ (26) హత్య కేసులో ఇద్దరు నిందితులను అదుపులోనికి తీసుకున్నట్లు రూరల్ సీఐ శివ గణేష్ తెలిపారు. ఆదివారం ఈ కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. పట్టణానికి చెందిన సురేష్ స్టూడియోలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సురేష్ భార్య భవానిపై అనుమానం పడుతూ ఆమెను ప్రతిరోజు కొడుతూ ఉండేవాడు. దీంతో ఈ విషయాన్ని భవాని తన అత్తతో కలిసి స్థానిక ఆలమూరు రోడ్డులో ఉన్న బాబు అండ్ బాబు కన్వెన్షన్ హాల్ కి వెళ్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ చంద్రు శ్రీ వర ప్రకాష్, కోరా గోవిందు, బుంగా సంజయ్ లకు వెళ్లి చెప్పింది. ఈ నేపథ్యంలో చంద్రు శ్రీ వర ప్రకాష్ రూ.2 లక్షలు సుఫారీ గోవిందుకు ఇచ్చి కుంజాల సురేష్‌ను చంపమని చెప్పారు. ఈ విషయాన్ని కోరా గోవిందు, సంజీవ్‌లు శెట్టి వీర వెంకటేశ్వరరావు (వీరబాబు)కు చెప్పారు. శెట్టి వెంకటేశ్వరరావు 31న రాత్రి సురేష్ కు మందు ఇస్తానని చెప్పి బైపాస్ రోడ్డుకు తీసుకువెళ్లి అతని స్నేహితులైన సాయి, మారి శ్రీను సహాయంతో సురేష్ కు విష పదార్థం కలిపిన మద్యం తాగించారు.తరువాత అతనిని తీసుకువెళ్లి హైవే రోడ్డులో వదిలి పెట్టాలని నిర్ణయి ంచు కున్నారు. మృతుడు సురేష్ బండి మీద ఎక్కించు కుని తీసుకు వెళుతుండగా మధ్యలో అతను కేకలు వేయడంతో మళ్లీ యథాస్థానానికి తీసుకొచ్చి అతని కొట్టి పీక మీద కాలుతో నొక్కి చంపారు. ఈ సంఘటనకు సంబంధించి పట్టణ పోలీసులు తొలుత అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేసినప్పటికీ బంధువులు, పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా హత్య కేసుగా మార్చి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో ఫోన్, తదితర సాక్ష్యాల ఆధారంగా శెట్టి వీర వెంకటేశ్వరరావు, గునుపల్లి నాగ సాయి కష్ణ ప్రసాద్ లను అదుపులోనికి తీసుకొని విచారించగా వారు నేరం అంగీకరించడంతో వీరిపై కేసు నమోదు చేసి ఆలమూరు కోర్టులో హాజరుపరచగా కోర్టు వీరికి రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపారు. ఈ కేసులో మిగిలిన చంద్రు వర ప్రకాష్, కోరా గోవిందు, బుంగా సంజయ్, మారి శ్రీను, వరప్రకాష్ అనుచరుడు నిందితులకు ఆశ్రయం కల్పించిన కపిలేశ్వరపురానికి చెందిన సత్తిబాబును అదుపులోనికి తీసుకోవాల్సి ఉందని సిఐ తెలిపారు.

## 100 రోజులు పూర్తి చేసుకున్న అన్న క్యాంటీన్

ప్రజాశక్తి-అమలాపురం

మాజీ లోక్‌సభ స్పీకర్ జియంసి బాలయోగి జయంతి సందర్భంగా ఆయన కుమారుడు గంటి హరీష్ మాధూర్ ఆధ్వర్యంలో పట్టణంలో ముమ్మిడివరం గేటు వద్ద గత ఏడాది అక్టోబర్ 1న ప్రారంభించిన్న క్యాంటీన్ ఆదివారం నాటికి వంద రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ ప్రతి రోజూ ఒక పూట రెండు వందలమందికి పైగా భోజనాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చిల్లా జగదీశ్వరి, మెట్ల రమణబాబు, నిమ్మకాయల జగ్గయ్యనాయుడు, నల్లా స్వామి, బొర్రా చిట్టిబాబు, దెందుకూరి సత్తిబాబు, వాసంశెట్టి సత్య, ఆశెట్టి ఆదిబాబు, చెరుకూరి సాయిరాం, మందపాటి కిరణ్, భాస్కర్ల రామకష్ణ, పోతుల బోసు, పరమట శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

భోజనం అందజేస్తున్న హరీష్

## పేకాట శిబిరంపై దాడి

### రూ.1.38 లక్షల స్వాధీనం

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలో వైయస్ఆర్ నగర్ నందు డాబాలో పేకాట శిబిరం పై రామచంద్రపురం పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ డి.సురేష్ బాబు సిబ్బంది తో దాడి నిర్వహించి పేకాట నిర్వహిస్తున్న కొయ్యాన జయరాజ్ , పిల్లి చిట్టిబాబు, యాదం చంటి, కోలా పాపారావు, కోలా రాంబాబు, నర్రు గురుమూర్తి లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 1,36,820 స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు



ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న పలువురు ప్రజాప్రతినిధులు

## కొత్తపేటలో ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-కొత్తపేట

సంక్రాంతిని పురస్కరించుకుని కొత్తపేట హైస్కూల్ గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ ఆదివారం ప్రారంభించారు. సుమారు 11 రోజులు పాటు గ్రౌండ్లో ఎగ్జిబిషన్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్లో జెయింట్‌వీల్, బ్రేక్ డ్యాన్స్, డ్రాగన్ వంటివి చిన్న పిల్లలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. పలు ఈవెంట్స్ ను మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, స్థానిక సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు,అవిడి సర్పంచ్ రెడ్డి చంటి,ముసునూరి వెంకటేశ్వరరావు,మండల వైసిపి అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, దంగేటి సుబ్రహ్మణ్యం, బొక్కా లోకేష్ తదితరులు ప్రారంభించారు. అనంతరం స్థానిక జెడ్పిటిసి సభ్యుడు గూడపాటి రమాదేవి, ప్రవీణ్ కుమార్ తన పిల్లలతో వచ్చి ఎగ్జిబిషన్ ను తిలకించారు. కార్యక్రమంలో బెజవాడ నారాయణరావు, విద్యాకమిటీ ఛైర్మన్ బీరా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించిన వైసిపి

ప్రజాశక్తి-కొత్తపేట

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం హయాంలో ముస్లింల అభివృద్ధి సంక్షేమాన్ని విస్మరించిందని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి మైనార్టీసెల్ అధ్యక్షులు మొహమ్మద్ మీరాన్ షరీఫ్ ఆరోపించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో కడపలోని హజ్ హౌస్ నిర్మించగా దానిని వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారిందని షరీఫ్ అన్నారు. హజ్ హౌస్ ను వెంటనే ముస్లింలకు వచ్చే రంజాన్ మాసం కల్లా అందుబాటులోకి తేవాలని లేకపోతే ఆందోళన చేస్తామన్నారు.

## ప్రభుత్వ విధానాలతో కానరాని పండుగ

ప్రజాశక్తి - పెరవలి

ప్రజల్లో ఎక్కడా పండుగ వాతావరణం కనిపించట్లేదని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అరిగెల అరుణకుమారి అన్నారు. ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లడారు. రాష్ట్రం, దేశంలో ఆర్థిక పరిస్థితులు సరిగా లేవన్నారు. నోట్ల రద్దుతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందన్నారు. ఈ ప్రభావం ప్రజలపై తీవ్రంగా ఉంద న్నారు. ఫలితంగానే నేడు ఎక్కడా పండుగ వాతావరణ కనిపించట్లేదన్నారు. ఏడా దికి ఒక్కసారి, చేసుకొనే పండుగ ఆర్థిక ప్రభావంతో వెలవెల వెలవెలబోతుందన్నారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలే కారణమన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రతో దేశంలో పెను మార్పులు జరిగి కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుందన్నారు.

## జనసేన ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ధవళేశ్వరం

వర్రే రమేష్ అధ్యక్షతన ఆదివారం జనసేన పార్టీ సంజయ్‌నగర్ ఆత్మీ య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెఎస్‌పి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ హాజరయ్యారు. పలువురిని పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు హాజరయ్యారు.

**మహారాజశ్రీ పెద్దాపురం అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**F.D.P.No. 3/2022**
**O.S.No. 24/2020**

*బిట్వీన్:*
**వాది:** పల్లా వెంకటరమణ
**మరియు**
**ప్రతివాద్లు:** తోట సాయినాథ్ వగైరా
*టు:*
1) తోట సాయినాథ్, తండ్రిం రామస్వామి, వయస్సు 27 సం॥లు, డో.నెం. 21-1-116, లలితా థియేటర్ వద్ద, రాజమండ్రి రోడ్.
2) తోట వెంకటనాథ్, తండ్రి: రామస్వామి, వయస్సు 25 సం॥లు, డో.నెం. 21-1-116, లలితా థియేటర్ వద్ద, రాజమండ్రి రోడ్.

**ప్రకటన**

పై నెంబరు దావాలో 1వ, 2వ ప్రతివాదులు అయిన మీకు కోర్టు నుండి ఎన్నిసార్లు సమన్లు పంపినా తీసుకోని కారణముచే **ది.01-02-2023 సం॥రం తేదీని ఉదయం 10:30 గంటలకు స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీకు ఏవిధమైన ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపర్చుకోగలరు.** లేనిచో మీ పరోక్షమున తీర్మానించడమగునని ఇందు మూలముగా తెలియపర్చడమైనది.

**దొమ్మేటి విల్సన్‌రాయ్,**
**కర్రా ఎలీషారావు,**
వాది తరుపు అడ్వకేట్స్, పెద్దాపురం.
సెల్: 99852 00523

**మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**ఓ.ఎస్.నెం. 45/2019**

*బిట్వీన్:*
కర్రి వీరవెంకట సాయిరెడ్డి, తండ్రి: ఆదిరెడ్డి, కొప్పవరం గ్రామం, అనపర్తి మండలం, తూర్పు గోదావరి జిల్లా.
**మరియు**
1) పలివెల సత్యానందం, తండ్రిం వెంకొజి, డో.నెం. 2-244/1, పెంట్‌హౌస్, ఆంజనేయ నగర్, Opp. APSP QRS, కాకినాడ రూరల్, కాకినాడ జిల్లా, పిన్: 533005.
2) పలివెల లక్ష్మి, భర్త: పలివెల సత్యానందం, -do-

పై నెంబరు దావా గ్రంథమునకు గాను ప్రతివాద్లు హాజరు నిమిత్తం మీకు ఎన్నిసార్లు కోర్టు సమన్లు /నోటీసులు పంపిననూ మీరు ఉద్దేశ్యం పూర్వకంగా సదరు కోర్టు సమన్లు /నోటీసులు త్రిప్పి వేయుచున్నారు. కావున **ది.21-02-2023 ఉదయం 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా మీ తరపు అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు దావాలో మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేనిఎడల సదరు దావాను మీకు పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
**(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు అనుసరించి మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది)**

**టి.వి.వి.రమణమూర్తి,**
అడ్వకేట్, దుప్పలపూడి.
సెల్: 96527 36367

**మహారాజశ్రీ అమలాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**E.P.No. 16/2019**
**O.S.No. 107/2018**

*బిట్వీన్:*
బొక్కా నాగవెంకట సత్యశివప్రసాద్
*...డి. హెచ్. ఆర్*
**మరియు**
గుత్తుల సుబ్బలక్ష్మి, భర్త: రామకృష్ణ, 35 సం॥లు, హిందూ, గృహిణి, డో.నెం. 5-160, పితాని వారి పాలెం, కామనగరువు.
*...జె.డి.ఆర్*

**ఈ దిగువ షెడ్యూలు ఆస్థి వేలపు ప్రకటన**

ఈ నెంబరు అమలు గ్రంథంలో పై జె.డి.ఆర్.యొక్క ఈ దిగువ షెడ్యూలు ఆస్థిని వేలము వేయుటకు శ్రీకోర్టు వారు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. సదరు ప్రకారం **ది.30-01-2023 సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట పై ఆస్థిని వేలంలో పాడుకొనదలచిన వారు హాజరు అయ్యి పాట వివరములు, షరతులు వగైరాలు నజారత్ ఆఫీసు నుండి పొంది వేలం పాటలో పాల్గొనవచ్చును.**

**వేలం వేయు ఆస్థి వివరము**

తూ॥గో॥జిల్లా, అమలాపురం ఎస్.ఆర్.ఓ.లో చేరిన, ఉప్పలగుప్తం మండలం, విలసవిల్లి గ్రామ పంచాయితీ విలసవిల్లి గ్రామం తాలూకు జిరాయితీ పల్లం రి.స.నెం. 107/4లో పూరా య.1.07ట్లులో దక్షిణం వైపు మధ్య య.0.11ట్లు ఆకుమడి భూమికి హద్దులు:
***తూర్పు:*** ఇరిగేషన్ బోది, గవర్నమెటు పుంత. ***దక్షిణం:*** ఈరోజున జి.శ్రీనివాసరావు గార్కి విక్రయించిన భూమి. ***పడమర:*** డి.లక్ష్మి ప్రియ వగైరాల భూమి. ***ఉత్తరం:*** కె.సత్యనారాయణ గార్కి ఈరోజున విక్రయించిన భూమి.

ఈ హద్దుల మధ్యస్తమయిన య.0-11ట్లు భూమి ఈజిమెంటరీ హక్కులు సర్వం సహా.

**డి.హెచ్.ఆర్. విలువ : రూ.2,75,000/-**
**అమీనా విలువ : రూ.2,75,000/-**

అమలాపురం, 08-01-23. **జి.ఎస్.నాయుడు,** అడ్వకేట్, అమలాపురం.